ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 19 అక్టోబరు 2025



వివరాలు ఇవ్వకుంటే బిల్లులు రావు

నిర్మల్‌రూరల్‌,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగి వివరాలను డీడీవోలు ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని, అప్డేట్ చేయకపోతే వారికి అక్టోబరు నెలకు సంబంధించిన వేతనాలు మంజూరు కావని జిల్లా ఖజానా శాఖ అధికారి సరోజ ప్రకటనలో తెలిపారు. ఖజానా శాఖ నుంచి వేతనాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లోని హెచ్‌ఆర్ మాడ్యూల్‌లో ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌ను అప్డేట్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాతనే అక్టోబరుకు సంబంధించిన వేతనాల బిల్లును ప్రాసెస్ చేసుకోవాలని, లేకపోతే అక్టోబరు వేతనాల బిల్లులు పోర్టల్‌లో ఓపెన్ కావని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా

» ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్

భైంసా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా సకల వసతులతో కూడిన మార్కండేయ మందిర నిర్మాణాన్ని చేపట్టి ఆధ్యాత్మిక ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసా అయ్యప్పనగర్ కాలనీ పరిధిలో పట్టణ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణదాస్, అధ్యక్షుడు మహేష్‌తో కలిసి మార్కండేయ మందిర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ పరిధిలో ప్రాధాన్యతననుసారం ఆలయాల అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తెలిపారు. ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పాటిల్, సంఘం సభ్యులు

స్తామని భరోసా ఇచ్చారు. ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా, భక్తి భావాలు పెంపొందింప చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ.32 లక్షలు, పద్మశాలి సంఘం భాగస్వామ్యం రూ.8 లక్షలు కలిపి మార్కండేయ మందిరాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత నిధుల ద్వారా మార్కండేయ మందిరంతో పాటు గణపతి, పార్వతమ్మ మందిరాలతో పాటు కాలక్షేమ మండపం సైతం నిర్మించడం జరుగుతోందన్నారు. వేద పండితుల మంత్రాల నడుమ ఎమ్మెల్యే పాటిల్, సంఘం ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ బాజన్నోల్ల గంగాధర్, బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షుడు రావుల రాము పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, జిల్లా ప్రతినిధి రమణరావ్ పాల్గొన్నారు.



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద

నిండుకుండలా గడ్డెన్నవాగు ప్రాజెక్టు

ఒక గేటు ద్వారా నీటివిడుదల
దిగువకు 587 క్యూసెక్కుల వదిలివేత

భైంసా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరద చేరిక కొనసాగుతోంది. శనివారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీల నీటి నిల్వతో నిండుకుండలా మారింది. ఈ క్రమంలో ఉదయం వేళలో ప్రాజెక్టులోకి 587 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. అప్పటికే పూర్తిస్థాయి నీటిసామర్థ్యం తోనున్న ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో నిర్వాహణాధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఇందులో భాగంగానే ప్రాజెక్టుకు సంబంధించిన ఒక వరద గేటును ఎత్తివేసి దిగువనున్న సుద్దవాగులోకి 587 క్యూసెక్కుల నీటిని వదిలివేసారు. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టులోకి ఇంత వరకు 14,125 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా వరద గేట్ల ద్వారా సుద్దవాగులోకి 12,871 టీఎంసీల నీటిని వదిలివేసినట్లు అధికారులు తెలిపారు.



నిర్మల్ ఆర్టీసీ డిపో వద్ద జేఏసీ నాయకుల ధర్నా



నిర్మానుష్యంగా మారిన నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్



నిరసన తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

బీసీ బంద్ ప్రశాంతం

» బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని నిరసనలు » నిలిచిన ఆర్టీసీ సర్వీసులు » స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసిన వ్యాపారులు

నిర్మల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని బీసీ జేఏసీ, కాంగ్రెస్ పార్టీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌తో పాటు వివిధ ప్రజా సంఘాలు చేపట్టిన జిల్లా బంద్ విజయవంతమైంది. జిల్లా బంద్‌పై గత రెండు రోజుల నుంచి అన్ని పక్షాలు చేపట్టిన ప్రచారంతో వాణిజ్య వ్యాపారులంతా స్వచ్ఛందంగా దుకాణాలను మూసి ఉంచి బంద్‌కు సహకరించారు. కాగా శనివారం ఉదయమే కాంగ్రెస్ నేతలతో పాటు మిగతా అన్ని పక్షాల నేతలు నిర్మల్ ఆర్టీసీ డిపో ముందు బైఠాయించి బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. అయితే అన్ని రాజకీయ పక్షాల నేతలంతా డిపో ముందు బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రధాన వాణిజ్య, వ్యాపార ప్రాంతాల్లో బైక్ ర్యాలీ కొనసాగింది. ఎక్కడికక్కడ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రైవేటు విద్యాసంస్థలను సైతం మూసి వేశారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాలన్ని జనం లేక వెలవెలబోయాయి. బంద్ సక్సెస్ కావడంతో అన్ని పక్షాల నేతలు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిందే...
- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలకు విద్యా, ఉద్యోగ రాజకీయ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాల్సిందేనని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు డిమాండ్ చేశారు. నిర్మల్‌లోని పలు చోట్ల జరిగిన నిరసన కార్యక్రమాల సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ జేఏసీ బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతును ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి 42శాతం రిజర్వేషన్‌లను అమలు చేయతలపెట్టిందన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు హక్కు మాత్రమేనని ఎవరో ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, బీసీ నేతలు భాస్కర్, నారాయణ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చిన్ను తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి..

బీసీ రిజర్వేషన్‌లను కేంద్రం ఆమోదించాలని వామపక్షాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నేత రాజన్న, ఎమ్మార్పీఎస్ నేత సాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈశ్వర్, ఎస్ఎన్‌రెడ్డి, విజయ్ కుమార్, తదితరులు డిపో ఎదుట నిరసన తెలిపారు. పోరాడితేనే రిజర్వేషన్‌లు దక్కుతాయన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

బీసీ అఖిలపక్ష జేఏసీ ఎన్నిక

ముథోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల బీసీ అఖిల పక్ష జేఏసీ కార్యవర్గాన్ని బీసీ సంఘం సీనియర్ నాయకులు రోళ్ల రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంఘం అఖిల పక్షం జేఏసీ మండల అధ్యక్షుడిగా బోయిడి అనిల్(ముథోల్), ఉపాధ్యక్షుడిగా సాపేవార్ కిష్టయ్య (గన్నోర), గడ్డం సుభాష్ (ముథోల్), ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ (ఆష్టా), సహాయ కార్యదర్శిగా రుమెల్ల జీవన్ (ముథోల్), సలహాదారులుగా రవి కిరణ్ గౌడ్ (తరోడా), మెత్రి సాయినాథ్ (ముథోల్), దత్తాద్రి (ఎడ్‌బిడ్), కిషన్ పటేల్ (ముథోల్)లు ఎన్నికయ్యారు. మండలంలో బీసీల ఐక్యతకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

కిక్కిరిసిన రైళ్లు

బాసర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అఖిల పక్షం పిలుపునిచ్చిన బంద్ కారణంగా శనివారం ఆర్టీసీసీ బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయంగా ప్రయాణికులు రైళ్లను ఆశ్రయించడంతో, బాసర రైల్వే స్టేషన్ ఒక్కసారిగా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ బంద్ ప్రభావంతో రైల్వే స్టేషన్‌లో సందడి వాతావరణం కనిపించింది. వివిధ గమ్యస్థానాలకు వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ళన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి. సాధారణ బోగీలే కాకుండా, రిజర్వేషన్, ఏసీ కూడా స్థలం లేకుండా ప్రయాణించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎలా వెళ్లాలో తెలియక, రైలు దొరికితే చాలు అన్నట్లుగా ప్రయాణికులు ప్రతి బోగీలోనూ ఎక్కారు. దీంతో రిజర్వేషన్ ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బాసర రైల్వేస్టేషన్‌లో రద్దీ, రైలు బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

గోమాత గోడు పట్టించుకోరా..?

» గండి రామన్న గోశాలపై అధికారుల నిర్లక్ష్యం » కనిపించకుండా పోయిన ఓ ఆవు » మరో ఆవు కాలు విరిగినా పట్టింపు కరువు

నిర్మల్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో ఏర్పాటు చేసిన గోశాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆవులను దానం చేసిన దాతల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఇక్కడి గోశాల నుంచి ఓ ఆవు పారిపోగా, తాజాగా మరో ఆవు కాలు విరిగింది. గోశాలలో ఉన్న కొన్ని దూడలు తరచూ ఆవులపై దాడి చేస్తున్నాయని ఆలయ ఈవో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన పట్టించుకోకపోవడం వల్లే ఆవు కాలు విరిగిందని దాతలు మండిపడుతున్నారు. ఎంతో భక్తి భావంతో పలువురు



కాలు విరిగి దీనవస్థలో ఉన్న గోమాత

దాతలు గోవులను ఇక్కడి గోశాలకు అందజేశారు. వాటిని సంరక్షించేందుకు ఓ కాపరిని కూడా ఏర్పాటు చేశారు. అయితే గోశాల నిర్వహణలో తలెత్తుతున్న పలు సమస్యలపై ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోశాలలో నెలకొన్న సమస్యలపై నిర్లక్ష్యం వహించిన ఆలయ ఈవోపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని దాతలు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

బాసర క్షేత్రంలో శృంగేరి పీఠాధిపతి బిజీ

బాసర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠం జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి బాసరలో పర్యటిస్తున్నారు. తన విజయ యాత్రలో భాగంగా శనివారం రాత్రి బాసర చేరుకున్న ఆయన ఇక్కడ వివిధ కార్యక్రమంలో బిజీగా గడుపుతున్నారు. ప్రత్యేక బలగాల బందోబస్తు మధ్య వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్షేత్రానికి విచ్చేసిన జగద్గురువులకు ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ప్రాతఃకాలంలో జగద్గురువులు ఆలయ అంతరాలయాన్ని సందర్శించారు. అక్కడ కొలువై ఉన్న సరస్వతి, మహాకాళీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకం, హారతి నిర్వహించారు.

మాస్టర్‌ప్లాన్ ప్రజంటేషన్..

శృంగేరి శారదా పీఠం జగద్గురువు విధుశేఖర భారతీ స్వామి జ్ఞాన సరస్వతి క్షేత్రాన్ని సందర్శించిన సందర్భంగా, ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ వివరాలను స్థానిక ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆయనకు వివరించారు. ఆలయ పునర్నిర్మాణాన్ని ప్రాణళికకు సంబంధించిన మ్యాప్‌ను స్వామీజీ ముందు ఉంచి, ప్రతిపాదిత పునర్నిర్మాణం, విస్తరణ పనులు గురించి ఎమ్మెల్యే వివరించారు. పుణ్యక్షేత్రమైన బాసరకు స్వామివారు విచ్చేయడం తమకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

పుణ్యభూమి బాసర...

ఎమ్మెల్యే వివరణ అనంతరం జగద్గురువు



బాసర ఆలయ అభివృద్ధిపై సూచనలిస్తున్న పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి

శ్రీ విధుశేఖర భారతీ స్వామి మాట్లాడుతూ.. శృంగేరీ పీఠాధిపతిగా అమ్మవారి చెంతకు రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. బాసర పుణ్యభూమి విశిష్టతను స్వామిజీ కొనియాడారు. వ్యాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతం ఇదేనని, సాక్షత్తు సరస్వతి అమ్మవారు ఇక్కడ దర్శనం ఇవ్వడం ఈ క్షేత్రం పవిత్రతను తెలియజేసస్తుందన్నారు. క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి, ఆగమశాస్త్రం ప్రకారం తగిన సూచనలు అందిస్తామని స్వామిజీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనాదేవి, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆలయంలో పూజలు...

అమ్మవారి పుణ్యక్షేత్రంలో శంకరమఠం ప్రారంభవుతుంది. ఆలయ సమీపాన గోదావరి నది తీరంలో ఏర్పాటఅవుతున్న మఠంలో నూతన ఆలయాలను నిర్మించారు. దేవతామూర్తుల ప్రతిష్టాపన ప్రారంభమైంది. ఈ కార్యక్రమాలకు పీఠాధిపతి హాజరై పూజల్లో పాల్గొన్నారు.



భైంసాలో నినాదాలు చేస్తున్న నిరసనకారులు



ముథోల్‌లో బడులు బంద్ చేయిస్తున్న దృశ్యం



బేల్‌తరోడాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నిర్మల్ - ఖానాపూర్ రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



కడెంలో రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

బీసీ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలె, యువజన సంఘాల ఆధ్వర్యంలో మండలాల్లో బంద్ చేయించారు. వ్యాపారులు సైతం ఉదయం నుంచే షాపులు మూసేసి మద్దతు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



పెంబిలో బంద్ నిర్వహిస్తున్న దృశ్యం



భైంసాలో డిపోలోనే నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



నిర్మల్‌లో బంద్ పాల్గొన్న జేఏసీ నేతలు



కుంటాలలో దుకాణాలు మూసేయిస్తున్న నేతలు



లోకేశ్వరంలో బంద్ పాటిస్తున్న దృశ్యం

ఉపాధి పనుల్లో అవకతవకలు

నర్సాపూర్(జి), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.5.76కోట్ల ఉపాధి హామీ పనులపై నిర్వహించిన ఆడిట్ రిపోర్ట్ అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల గోల్‌మాల్‌ను బట్టబయలు చేసింది. మండలంలో మొత్తం 74,932 చెట్లు నాటగా, వాటిలో ఏకంగా 40,703చెట్లు చనిపోయాయని ఆడిట్‌లో స్పష్టమైంది. మండలకేంద్రంలోని రామాలయం వద్ద 500ల మొక్కలు నాటితే 315 చనిపోయాయని ఆడిట్ బృందం చదివి వినిపించగా, స్థానిక సామాజిక కార్యకర్త సుధాకర్ వెంటనే జోక్యం చేసుకుని 500చెట్లు నాటకుండానే రికార్డులు చూపుతున్నారని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా 64పనులకు మ్యానువల్ రికార్డులు ఇవ్వకపోవడం, 26 ఇంకుడు గుంతల పేమెంట్ రాకపోగా టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్ కనీసం ఆ విషయం తెలియదని చెప్పారు. భామ్ని(బి) గ్రామకార్యదర్శి 390 చెట్లను నాటకుండా పక్కన పడేయం, ఎంపీడీవో సంతకాలు లేకుండానే డబ్బులు జమ కావడం వంటి అక్రమాలు వెలుగుచూశాయి. చెట్లు నాటక పోయినా నాటినట్లు చూపించిన పనులపై ఎంక్వయిరీ చేస్తానని, అక్రమాలు జరిగితే సహించేది లేదని డీఆర్‌డీవో పేర్కొన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యరక్షణ

భైంసా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా నిత్యం నడక, వ్యాయమం, యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్య రక్షణ చేకూరుతుందని భైంసా టౌన్ సీఐ గోపీనాథ్ పేర్కొన్నారు. శనివారం భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద వాకర్స్, యోగా సాధకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రతిఒక్కరూ ఆహార నియమావళిని పాటించాలన్నారు. ప్రతి రోజు గంట మేరనైనా ఆరోగ్య రక్షణకు నడవడం, అసనాలు వేయడం, స్విమ్మింగ్ చేయడం, ఆటలాడటం వంటి వాటిని చేయాలని పేర్కొన్నారు.ఇదే క్రమంలో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో కొత్త విధానాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అన్ని వేళల అప్రమత్తతతో వ్యవహరిస్తూ, జాగ్రత్త చర్యలు పాటిస్తే సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండగలుగుతామని వివరించారు. ఇందులో మనోరమ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ డా. నగేష్, రిటైర్డ్ పశువైద్య సహాయ సంచాలకులు డా. పోశెట్టి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పురాస్తు గోపాల్, రాజలింగ్, వ్యాపార వేత్త సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధకులతో మాట్లాడుతున్న సీఐ గోపీనాథ్

పురుగుల మందు డబ్బాతో మహిళా రైతు నిరసన

భైంసా రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో ఉమా అనే రైతు పండించిన పంట సోయా 20 క్వింటాళ్ల వరకు తన ఇంటి ముందు ఆవరణలో ఆరబెట్టారు. ఇటీవల భారీ వర్షం కురవడంతో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ ఉప్పొంగి ప్రవహించి ఇంటి ఆవరణలో ఆరబెట్టిన సోయాలో నీళ్లు ప్రవహించి పంటంతా తడిసి నష్టపోయామని రైతు ఆవేదన చెందారు. అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే తాము పంట నష్టపోయామని, వారికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు గుత్తేదారులతో మాట్లాడి పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. లేదంటే తమ కు ఆత్మహత్య శరణ్యమని పురుగుల మందు డబ్బా పట్టుకొని ఆవేదన వ్యక్తం చేశారు.



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతు ఉమ



ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత

డిగ్రీ కళాశాలలో ఎకో బజార్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై అవగాహన పెంచేలా కళాశాలలో క్యాంపస్ ఎకో బజార్ నిర్వహించినట్లు సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఈకో బజార్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి తీసుకొచ్చిన వంటకాల రుచులను చూడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే పలు వస్తువులను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. వీటిని తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును కళాశాల అభివృద్ధికి ఉపయోగిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

తలమడుగు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు త్వరగా కోలుకొని ప్రజాసేవ చేయాలని శనివారం బరంపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మూడు అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ ప్రస్తుత మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి ఆరోగ్యం త్వరగా బాగు అయ్యి ప్రజల సేవ చేసేందుకు ముందుకు రావాలని వేంకటేశ్వర స్వామిని వేడుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆయన పేరిట అర్చన చేయించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

● నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కంటేగాం గ్రామం సమీపంలో పంట చేలలో సోయాబీన్ పంటను పట్టేందుకు వెళ్లిన హార్వెస్టర్ ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన హార్వెస్టర్ యజమాని ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారుల మాటను పట్టించుకోకుండా వెళ్లి పోయినట్లు తెలిసింది. విద్యుత్ స్తంభం విరిగి పోవడంతో నిగిని కంటేగాం, బాబెర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



కంటేగాం సమీపంలోని చేలలో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

ముగిసిన మద్యం టెండర్ల ప్రక్రియ

● ఆదిలాబాద్ జిల్లాలో 2023తో పోలిస్తే తగ్గిన దరఖాస్తులు ● చివరిరోజు 318 టెండర్ల దాఖలు



ఆదిలాబాద్‌లో టెండర్‌లను స్వీకరిస్తున్న అధికారులు



ఖాళీగా దర్శనమిస్తున్న బారికేడ్లు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 40 మద్యం దుకాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈసారి భారీ పోటీ నెలకొని ఉంటుందన్న అంచనాలను తారుమారు చేస్తూ 2023తో పోలిస్తే తక్కువ సంఖ్యలో టెండర్‌లు దాఖలు కావడం ఆశ్చర్యానికి గురిచేసింది. 2023లో 1047 దరఖాస్తులు రాగా.. ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం 709 కే పరిమితమైంది. అయితే దరఖాస్తు స్వీకరణకు చలాన్‌ను రూ.3 లక్షలకు పెంచడం, చాలా చోట్ల వ్యాపారాలు సిండికేట్‌గా మారారన్న విమర్శలు రావడమే టెండర్ల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. టెండర్ల ప్రక్రియ ప్రారభమైన నాటి నుంచి కేవలం 391 దరఖాస్తులు రాగా... చివరిరోజు 318 టెండర్లను ఎక్సైజ్ అధికారులు స్వీకరించారు.

చివరి రోజు ఎక్కువ టెండర్‌లు

చివరి రోజు ఎక్కువ టెండర్‌లు దాఖలు కాగా.. అందుకు అనుగుణంగానే ఎక్సైజ్ యంత్రాంగం తగు ఏర్పాట్లు చేపట్టింది. అయినప్పటికీ అంచనాలకు తగ్గట్లుగా ఔత్సాహికులు ఆసక్తి చూపలేదన్న చర్చలు వినిపించాయి. ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ఖాళీ బారికేడ్లు దర్శనమిచ్చాయి. ఇక అత్యధికంగా 5వ నంబర్ దుకాణానికి 41 టెండర్‌లు రాగా... అత్యల్పంగా 16, 40 దుకాణాలకు కేవలం ఒకే ఒక దరఖాస్తు రావడం గమనార్హం. 17, 18, 28 దుకాణాలకు రెండేసి దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 23వ తేదీన డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరిపేందుకు ఎక్సైజ్ అధికారులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలను తీసుకెళ్తూ..

ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ తిరుమల కొండ

● మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

● ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

తలమడుగు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ తిరుమల కొండ అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. శనివారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ గుట్టపై వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రతీ శనివారం నిర్వహించి ప్రత్యేక హారతి, భజన వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ బరంపూర్ కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి దశాబ్దాల చరిత్ర ఉందని, ఈ ఆలయం దినం దినం తెలంగాణ తిరుపతిగా ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని సూచించారు. నేటి మనిషి మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో ఛిషికి మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. బరంపూర్ వేంకటేశ్వర స్వామి భక్తులకు అన్నదానం నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాను. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాపూరావును సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడీటీసీ గోక గణేష్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, దేవ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గణేష్ రెడ్డి, బొల్లారం బాబన్న, జీవన్ రెడ్డి, ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు బరకం మల్లేష్, నాగారెడ్డి మల్లారెడ్డి, టీఎస్.శాస్త్రి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఆదిలాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు

బీసీల చుట్టే.. రాజకీయం

(5వ పేజీ తరువాయి...)

విజయవంతమైనట్లు ప్రకటించాయి. సాయంత్రం సమయానికి ఆర్టీసీ బస్సులు కూడా వివిధ రూట్లలో ప్రారంభించారు. బంద్‌లో భాగంగా బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు అఖిల పక్షం నేతలు ఉదయం మార్కెట్‌లో ర్యాలీగా తిరుగుతూ దుకాణాలను మూసివేయించారు.

ఇబ్బందుల్లో ప్రయాణికులు

బంద్‌తో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బంద్ సమాచారం తెలియని గ్రామీణ ప్రాంతాల ప్రజలు బస్టాండ్‌కు చేరుకుని బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంద్‌కు మద్దతుగా నిలిచిన రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు బస్సులను అడ్డుకున్నాయి. దీంతో బస్సులు కదలలేని పరిస్థితి ఏర్పడింది. అత్యవసరంగా సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రయాణం చేయాల్సి వచ్చింది. బంద్‌తో ఆర్టీసీకి రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ వాహన దారులు అడ్డగోలుగా రవాణా చార్జీలను పెంచేశారు.

రిజర్వేషన్ల అమలుకు డిమాండ్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్, రాష్ట్రపతికి పంపించడం జరిగిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్‌లు అన్నారు. కాగా, బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. అన్ని తెలిసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల అమలు కు చట్టం చేయకుండా బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు మండిపడ్డారు.



బస్టాండ్ ఎదుట బైఠాయించిన బీఆర్‌ఎస్ నేతలు



భైంసాలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

భక్తి శ్రద్ధలతో గోవత్స ద్వాదశి వేడుకలు

భైంసా,అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18: పట్టణంలోని మహిళలు శనివారం గోవత్స ద్వాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కొంతమంది మహిళలు గోశాలలకు, ఇంకొంత మంది మహిళలు పశువుల పాకలకు తరలివెళ్లి గోమాతలకు పూజలు చేశారు. గోవత్స వేడుకలలో భాగంగా మహిళలు ముందుగా గోవులకు స్నానాలు చేయించి వాటికి పసుపు, కుంకుమ పూలతో శోభయామానంగా ఆలంకరించారు.అనంతరం ధాన్యాలు, గడ్డి, తీపి వంటకాలను నైవేద్యాలుగా సమర్పించారు. గోవుల చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు అందించాలని వేడుకున్నారు. గోవులకు భక్తిశ్రద్ధలతో హారతులు అందించారు.



తాడిహత్నూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం

నార్నూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, అప్పటి వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీసీ ఐక్యవేదిక మండల అధ్యక్షులు కేంద్రే మహదవ్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర బంద్‌కు బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు తాడిహత్నూర్, నార్నూర్, గాదిగూడ, లోకారీ ఇతర ప్రాంతాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ బంద్‌కు ఆయా పార్టీ నాయకులు, కుల సంఘాలు మద్దతు తెలిపాయి. నార్నూర్‌లో గాంధీ చౌక్ అన్ని పార్టీలు, కుల సంఘాల నాయకులు కలిసి నిరసన చేశారు. కార్యక్రమంలో బ్రిజాలల్, దేవరావు లోకండే, బీజేపీ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్, దళిత రత్న అవార్డు గ్రహీత కోరేలా మహేందర్, కాంతరావు దుర్గే, షేక్ దస్తాగిరి, మసునే యోగేష్, విశాల్ కోటగిరి, విష్ణు పడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక



విశ్రాంత ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గం

నిర్మల్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల పరిశీలకులుగా శంకర్ రెడ్డి, ప్రాథమిక సభ్యుల సమక్షంలో సంఘం నియమావళిని అనుసరించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హ్యాట్రిక్ జిల్లా అధ్యక్షుడిగా ఎంసీ లింగన్న, ప్రధాన కార్యదర్శిగా కే. పోతారెడ్డి, జిల్లా కోశాధికారిగా లోలం గంగన్న, బి. రమేష్, పోశెట్టి, నాగేశ్వరరావు, ఏ. రజిని, విలాస్, కరీం, రామా గౌడ్, జనార్ధన్, రాజేశ్వర్, సుజాత, రాములు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పెన్షనర్ల ఉద్యోగ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరి సహాయ సహకారాలతో ముందుకు తీసుకెళ్తానన్నారు.

బీసీలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రం లో ఉన్న బీజేపీ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని, కేవలం రాజకీయ పబ్బం గడుపుకోడానికే ధర్నాలు, బంద్‌లు చేస్తున్నాయని బీసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంద మహేష్ ఆరోపించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లుపై తీర్మాణం చేయలేదని, పార్లమెంట్ లో కేంద్రం బిల్లుపై తీర్మాణం చేసి చట్టం చేయడం లేదన్నారు. సమావేశంలో నేతలు దాసు, మనోజ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

బోథ్; అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ పైన చేపట్టిన బంద్ బోథ్, సోనాల మండలాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలను మూసి ఉంచారు. ప్రభుత్వ పాఠశాల కార్యాలయాలు యదావిధిగా పని చేశాయి. స్థానిక వ్యాపారులు తమ వ్యాపార సంస్థలను మూసి ఉంచారు. ఆర్టీసీ బస్సులు నడపక పోవడంతో ప్రజలు తమ పనులనువాయిదా వేసుకోగా అత్యవసర పనిమీద వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. ఒక రోజు ముందుగానే బందు పాటించాలని రాజకీయ పక్షాల వారితో పాటు బీసీ సంఘాల వారుచెప్పడంతో బంద్ విజయవంతమైంది.



నేరడిగొండలో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్

నేరడిగొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ 42 సాధన కోసం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పిలుపు మేరకు శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ నాయకులతో కలిసి బంద్‌కు మద్దతుగా పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలో వీధుల గుండా తిరుగుతూ షాపుల యజమానులను బంద్‌కు సహకరించాలని కోరారు. వారు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు బీసీల ద్రోహులని, 42 శాతం బీసీలకు రిజర్వేషన్ బిల్లు ఆపిందే బిజెపి అని, గతంలో బీసీ రిజర్వేషన్లు తగ్గించింది బిఆర్ఎస్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నేరడిగొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ జేఏసి, భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అదేశానుసారం శనివారం తెలంగాణ బంద్‌లో బాగంగా నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వ్యాపార సముదాయాలను మూసివేయించి మండల భారాస నాయకులు బంద్ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీలకు 42 రిజర్వేషన్ అమలు చేయాలని, 9వ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, భారాస నాయకులు సాబ్లే ప్రతాప్ సింగ్, పండరి, మహేందర్ రెడ్డి, సాబ్లే సంతోష్ సింగ్, శేఖర్, లక్ష్మణ్, మదన్, శ్రీను, సీతారాం, అనిల్, రవి, నగేష్, ఖదీర్, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్(గుడిహత్నూర్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సంఘాలు శనివారం తెలంగాణ బంద్‌కు పిలుపునివ్వడంతో ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ బంద్‌కు మద్దతు తెలిపారు. బంద్‌లో భాగంగా విద్యా, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఆయా కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నేరడిగొండలో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

బజార్‌హత్నూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏకైక డిమాండ్‌తో బిసి సంఘాలు తలపెట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. కాగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దతుగా తహసీల్దార్‌కు మెమోరాండం అందించగా బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యవర్గ సభ్యులు బంద్‌కు మద్దతు పలికారు. పిప్పిరి గ్రామంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అంతర్ రాష్ట్ర రోడ్డు పై ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, పాండురంగ్, చిలుకూరు భూమన్న, సుభాష్, పోరెడ్డి శ్రీనివాస్, కొత్త శంకర్ ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో తహసీల్దార్‌కు మెమోరాండం అందజేస్తున్న నాయకులు

భీంపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌ల కోసం తలపెట్టిన బంద్‌ను బిసి సంఘాల పిలుపు మేరకు మండల కేంద్రం భీంపూర్‌లో శనివారం బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముకుందా సంతోష్ ఆధ్వర్యంలో దుకాణాలను మూసివేశారు. ఈ బంద్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన బీసీ సంఘాల బంద్ మండలంలో విజయవంతంగా సాగింది. బీసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను, హోటల్ పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం మండలంలోని సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల మండల అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ సంఘాలు ఎక్కువగా ఉన్నందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లను కల్పించేందుకు అన్ని సంఘాలు మద్దతు అన్ని పార్టీల నాయకులు మద్దతిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు.



తలమడుగులో పాఠశాలలు బంద్ చేసిన బీసీ సంఘాల నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలించాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాజేశ్వర్, బిజెపి మండల కన్వీనర్ నక్క ధనంజయ్, టిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీసీ సంఘాల నాయకులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తోట ప్రమోద్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, నరసింహులు, రమాకాంత్, బట్టు నరేష్, బడగారి శ్రీకాంత్, వెంకట్ యాదవ్, ఆసం రవి, మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు నేతుల గంగన్న, మహిళా నాయకురాలు పల్లవి, రాంబాయి తదితరులు పాల్గొన్నారు. కాగా సుంకిడిలో నిర్వహించిన రాష్ట్ర రోకోను అదిలాబాద్ సీఐ ఫణిందర్ ఎస్సై రాధికలు విరమింప చేశారు.

ఇంద్రవెల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది.



ఇంద్రవెల్లిలో బంద్‌లో భాగంగా దుకాణాలు మూసివేసిన వ్యాపారులు

బీసీ సంఘం తలపెట్టిన బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలన్నీ సెలవు ప్రకటించగా వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు.

సిరికొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మండల వ్యాప్తంగా చేసిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన నేతలు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తిరుగుతూ బంద్‌కు సహకరించాలని కోరారు. అందుకనుగుణంగా వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ని పాటించి మద్దతు తెలిపాయి. కాగా అక్కడక్కడా కొన్ని గ్రామాల్లో బంద్ అసంపూర్ణంగానే కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సిరికొండలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ మండల నాయకులు



మత్తడిగూడలో కోలాటం ఆడుతున్న ఎస్పీ



రిమ్మలో ఆదివాసీలు చిత్రాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

గుస్సాడీ వేడుకలకు జాతీయ గుర్తింపు రావాలి

» ఎస్పీ అఖిల్ మహాజన్ » మత్తడిగూడలో దండారి వేడుకలు

ఉట్నూర్/ఆదిలాబాద్(సిరికొండ)/ఆదిలాబాద్(బోథ్)/నేరడి గొండ/తలమడుగు/బజార్‌హత్నూర్/ఇంద్రవెల్లి,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల సాంస్కృతి సంప్రదాయాలతో గిరిజన గూడాలలో దీపావళి దండారి వేడుకలు ఊపందుకున్నాయి. మండలంలోని మత్తడిగూడలో జరిగిన దండారి వేడుకలకు జిల్లా ఎస్పీఅఖిల్‌మహాజన్,ఉట్నూర్అడిషనల్ ఎస్పీకాజల్‌సింగ్‌లుహాజరయ్యారు. అనంతరం ఎస్పీఅఖిల్ మహాజన్ మాట్లాడుతూ దండారి సంబరాలు గోండులయూనిక్ కల్చర్ అని అన్నారు.పీఎం ఆధ్వర్యంలో ఇప్పటికే గిరిజనుల గుస్సాడికి గుర్తింపు లభించింది అన్నారు.జాతీయ గుర్తింపు రావాల్సిఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడాలలో నిర్వహించుకుంటున్న దీపావళి దండారి ఉత్సవాలు ఎంతో సంబరంగా జరుగుతున్నాయని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజనులకు దీపావళి దండారి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజులతో ఎస్పీ అఖిల్ మహాజన్ కోలాటం ఆడగాగిరిజన మహిళతో కలిసి అదనపు ఎస్పీకాజల్‌సింగ్ నృత్యాలుచేస్తూ గిరిజనులను ఆనంద పరిచారు.ఆదిలాబాద్(సిరికొండ)లో అనాదిగా వస్తున్న ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.ఈకార్యక్రమంలో ఎస్సై సట్లపల్లిపూజ,మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, గ్రామపటేల్, సార్మేడీ,దేవరీ,మహాజన్‌లు,దండారీలు,గ్రామస్థులు పాల్గొన్నారు. ఆదిలాబాద్(బోథ్),మాట ఇస్తే మరిచిపోనని అభివృద్ధికోసం పాటుపడడమే తన నైజం అని మాజీఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శనివారం సోనాలలోని కేశవ్‌గూ మహాదుగూడ గ్రామాలలో పర్యటించారు.ఆయన వెంట సోషల్ మీడియా కన్వీనర్ భీమావుపాటిల్,సుధీర్‌రెడ్డి, హరీష్, సర్పంచ్‌ల మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్‌పాల్గొన్నారు.నేరడిగొండలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివాసిగూడేలలో గుస్సాడీనృత్యాలతో కోలాటాల నడుమ శనివారం యాపల్‌గూడలో దండారి కార్య క్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్‌నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడేగజేందర్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడి భవిష్యత్‌తరాలకు అందించాలని అన్నారు.ఉట్నూర్‌లో నేటి తరం యువనాయకుడు, గోండుల బిడ్డ, యువ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వద్ద ఆదివాసీగిరిజనుల దండారి బృందాల ఆధ్వర్యంలో ఆదివారందండారి ధూంధాం నిర్వహిస్తున్నారు. తలమడుగు ఆదివాసుల సాంస్కృతి సాంప్రదాయాలు భారతదేశానికి ఆదర్శమని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసులు నిర్వహించే గుస్సాడీ పండుగ సందర్భంగా మండలంలోని ఉమ్రి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా వస్తున్నా సంస్కృతి సాంప్రదాయాలను ఆదివాసులు కాపాడుకుంటున్నారన్నారు.ఇందులో ఎంపీడీవో శంకర్ ఎంపీఈఓ,బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ముడుపు కేదారేశ్వరరెడ్డి, పటేల్‌పెందూర్‌మాధవ్, మాజీడీసీపీ డైరెక్టర్ పెందురు వనమాల పీఆర్‌ఏఈనారాయణ,పంచాయతీ కార్యదర్శినితిన్, గ్రామపెద్దలు మహారాష్ట్రగుస్సాడీలు పాల్గొన్నారు. బజార్‌హత్నూర్‌లోని ఆదివాసీ అన్ని గూడాల్లో దండారి ఉత్సవాల సందడి కనిపిస్తోంది. జాతర్ల, మాడగూడ, అనంత పూర్, చింతసాంగ్వి, కొత్తపల్లి, ఆందుగూడ తదితర గ్రామాల్లో గిజనులు తమ సంస్కృతి, సాంప్రదాయాలతో ఒకరికొకరు అతిథ్యమిస్తూ పండగ ఘనంగా జరుపుకుంటున్నారు. కాగా శనివారం అనంత పూర్‌కు గుడిహత్నూర్ మండలంలోని మాన్కపూర్ నుంచి జాతర్లకుడెడ్రాగ్రామాల నుంచి దండారి అతిథులుగా వచ్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా అతిథులకు గ్రామం సామూహిక విందు భోజనాలు అందించారు.దం డారి ఉత్సవాలుఐక్యత, శాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అనంత పూర్, మాడగూడ పటేల్లు సిడాంహీరాలాల్, గొడంభీంరావ్‌లు తెలిపారు. ఇంద్రవెల్లిలో ఆదివాసీ గిరిజనుల సాంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని భావితరాలకు పదిలంగా అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని డోంగర్‌గావ్‌లో గుస్సాడి దండారీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ పెందోర్ బాదుపటేల్, అర్క సెడ్మారావ్, పెందోర్ రాము, పెందుర్ భీంజీ, పెందుర్ లింబారావ్,కోవాభీంరావ్, మాడావిశేషనారాయణ, మడావి లచ్చు, సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, సీనియర్ నాయకులు మీర్జాయాకూబ్ బేగ్, సోమోరే నాగోరావు, పట్టణ అధ్యక్షులు ఎండీ జహర్ పాల్గొన్నారు.



సౌండ్ సిస్టం అందజేస్తున్న మాజీ ఎంపీపీ



మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిథి గుస్పాడీలతో తహసీల్దార్



గుస్సాడీలతో ఆడే గజేందర్



బజార్‌హత్నూర్‌లో సామూహిక భోజనాలు



ఉట్నూర్‌లోని జరుగుతున్న దండారి ధూందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

24న ఖానాపూర్‌లో భీమన్న జాతర



ఖానాపూర్‌లో భీమన్న గజాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఖానాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 24వ తేదీన ఖానాపూర్‌లో భీమన్న దేవుని జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీలో గల భీమన్న దేవుడి ఆలయంలో శనివారం ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో భీమన్న గజాలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమన్న గజాలను పట్టణంలో ఊరేగించారు. నెల 23వ తేదీన స్వామివారికి గంగ స్నానం, 24వ తేదీన ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అంతర్గవ్ గ్రామంలో బోరు బాగు చేయించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోరును బాగు చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

భీంపూర్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండలం అంతర్గవ్‌లో మంచి నీటి బోరు బాగు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్న వైనం గురించి పనిచేయని చేతి పంపుతో ఇబ్బందులు అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి నర్సయ్య అంతర్గవ్‌గ్రామానికి వెళ్లి బోరును బాగు చేయించారు. దీనితో స్థానికులు కునార్పు అశోక్, కపిల్, నితిన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో దీపావళి ముగ్గుల సందడి



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

నిర్మల్‌చైన్‌గేట్,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని స్థానిక జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లో విద్యార్థినులు ముందస్తు దీపావళి ముగ్గుల పోటీలతో అందరినీ అలరించారు. వెలుగుతున్న దీపాలు, లక్ష్మీదేవి ఆకారంతో పాటు మరికొన్ని ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులతో అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు, టీచర్లు మంజుల, నాగలత, హేమలత, పీడీ విజయలక్ష్మి, కూనశృతి, మనోహర్, దత్తురాం, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, వినోద్, శ్రీమంత్, వసంతరావు, ఇర్ఫాన్ షేక్, కుమార్, గంగాధర్, దయానంద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏరోడ్రం వద్ద అమన్ స్విమ్మింగ్ పూల్ అండ్ గెస్ట్ హౌజ్ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ. 23,400 నగదు, 8 సెల్ ఫోన్‌లు, 7 ద్విచక్ర వాహనాలను జప్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కోతుల దాడిలో వృద్ధులకు గాయాలు





చికిత్స పొందుతున్న బోరే సరస్వతి బాయి,బోరే భోజాబాయి

భైంసా,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):ఇద్దరు వృద్ధులు కోతుల దాడుల బారినపడి తీవ్ర గాయలపాలైన ఘటన శనివారం కుబీర్ మండలంలోని గోడాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బోరే సరస్వతి బాయి(58), బోరే భోజబాయి (70)అనే ఇద్దరు వృద్ధులు ఇంటి ఆవరణలో రోజు వారి పనులు నిర్వహించుకుంటున్నారు. ఇదే సమయంలో కోతుల సముహం అక్కడి ప్రాంతానికి రాగా వాటిని చూసి ఇద్దరు ఇళ్లలోకి పరుగుల పెట్టారు. అప్పటికే కోతులు వారిరువురిని సమీపించి దాడులకు పాల్పడ్డాయి. దీంతో ఇద్దరు వృద్ధులు కింద పడిపోయాడు. కోతులు కరువడంతో సరస్వతిబాయి మోచేతితో కడుపు భాగానికి తీవ్ర గాయాలయ్యాయి.ఇక భోజబాయి కాలి, పిక్క భాగాలతో పాటు ఇతర శరీర భాగాలకు కోతులు కరువడంతో మాంసం ముద్ద బయటపడింది. సమీప నివాస గృహాల వారు కర్రలతో వెంబడించగా కోతులు అక్కడి నుంచి పారిపోయాయి. వెంటనే వారిరువురిని భైంసాలోని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారన్నారు.

చీకటిని పారదోలే వెలుగుల దీపావళి



ఇచ్చోడలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణం

» బాణసంచాతో జాగ్రత్త
» అప్రమత్తతే శ్రీరామరక్ష
» పర్యవేక్షణ తప్పనిసరంటున్న నిపుణులు

ఇచ్చోడ, అక్టోబరు,18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ.. చిన్నా పెద్ద అంతా సంతోషంగా జరుపుకునే పండగల్లో దీపావళి ప్రత్యేక పండుగ. ఈ పండగ సంతోషమో.. అంత ప్రమాదకరంగా కూడాను.. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకె ముప్పు వాటిల్లుతుంది. ముఖ్యంగా చిన్నారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పెద్దల సమక్షంలో బాణాసంచా కాల్చాలి. నిర్లక్ష్యం వహిస్తే జీవితమే చీకటిగా మారుతుంది. వైద్యులు అగ్నిమాక శాఖ అధికారులు చెప్పే సూచనల ప్రకారంగా బాణాసంచాలను కాల్చితే ఎలాంటి సమస్య ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. పండగ సందర్భంగా అగ్నిమాపక శాఖ, వైద్యాధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారు. టపాసుల దుకాణలను పర్యవేక్షిస్తుంటారు. ఈ నేపథ్యంలో దీపావళి పర్వదినం రోజు పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఒకం బాణసంచా కాల్చుతుంటే మరోకరు సరదాగా భయపెట్టడం లాంటివి చేయరాదు. బాణసంచా కాల్చేటప్పుడు పాదరక్షలు, కళ్లజోడు ధరించాలి

» వృద్ధులు, మహిళలు, రోగులు, దివ్యాంగులకు దూరంగా టపాసులు కాల్చడం చాలా మంచిది. చాలా మది బాణసంచా లను చేతిలో పట్టుకుని కాల్చుతారు. భూమి మీద పెట్టి కాల్చాలి. జనసంచారం ఉండే ప్రదేశాల్లో కాల్చరాదు.

» బాణసంచా కాల్చే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే పరుగు తీయకుండా వెంటనే కాలిన గాయాలపై చల్లని నీటిని చల్లాలి. నీరు పోయకూడదనేది అపోహ నిపుణులు నిర్ధారించారు. గుండెపోటు ఉన్న వారు పెద్దపెద్ద శబ్దాలు వచ్చే టపాసులకు దూరంగా ఉండాలి

» ముఖ్యంగా శ్వాసకోస వ్యాధులున్న వారు చిచ్చుబుడ్ల లాంటివి, పోగ వచ్చే బాణసంచాకు దూరంగా ఉండాలి.

» దీపావళి పండగ అయిన తరవాత కాలిన బాణసంచాలను, వ్యర్థాలను ఇంటి ముందర పడేసి కాల్చడం లాంటివి చేస్తాం. వాటిలో కాలే స్వభావం ఉంటుంది. ఒక్కసారి పేలి ముఖం కాలడం లాంటివి జరుగుతుంటాయి. దీనివల్ల కంటికి ముఖానికి తీవ్ర గాయాలయ్యే అవకాశాలున్నాయి.

అనుమతులు వచ్చే వరకు ఏర్పాటుచేయరాదు

టపాసుల దుకాణాలకు పూర్తి అనుమతులు వచ్చే వరకు ఏర్పాటు చేయరాదు. ముందుగా జిల్లా అగ్నిమాపక శాఖాధికారికి అన్‌లైన్‌లో చలనాకట్టాలి.వారు ఎంచుకున్న స్థలం అనుకూలంగా ఉందో లేదో పరిశీలించిన తరువాత డీఎఫ్‌వో నుంచి తాత్కలిక లైసెన్సు వస్తుంది. దాంతో పాటు పోలీసు, గ్రామపంచాయతీ, రెవెన్యూ ధ్రువీకరణ పత్రాలను పొందాలి. ఆపత్రాలతో తహసీల్దార్ ఆర్‌డీఓకు అనుమతుల కోసం ప్రతిపాదించగా తుది లైసెన్స్ మంజూరు అవుతుంది.

-మహ్మద్ షఫీ, అగ్నిమాపక శాఖ అధికారి, ఇచ్చోడ

టపాసులు కాల్చేటప్పుడు ఇవి పాటించాలి

అనుమతి ఉన్న దుకాణాల్లోనే టపాసులు కోనుగోలు చేయాలి. బాణసంచా కొనుగోలుకు చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో తీసుకెళ్లరాదు. బాణసంచా ఎక్కడ పడితే అక్కడ దాచరాదు. సురక్షిత ప్రాంతాల్లోనే నిల్వ చేయాలి. బాణసంచా కాల్చేటప్పుడు ప్రమాదం జరిగితే 101 నంబరుకు ఫోన్ చేయాలి. స్థానికంగా తయారు చేసిన వాటిని కాల్చరాదు. ఖాళీ ప్రదేశాల్లోనే బాణసంచా కాల్చాలి. రోడ్డుపై బాణ సంచా కాల్చే సమయంలో వాహనదారులను చూసి జాగ్రత్తగా కాల్చాలి. పెట్రోల్ బంకులు, పూరి గుడిసెలు, గడ్డివాముల వద్ద కాల్చరాదు. ముఖ్యంగా రాకెట్లు కాల్చేట ప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రాకెట్లు వంక రగా పెట్టడం వల్ల అవినివాసాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

దుకాణాల్లో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

బాణసంచా దుకాణాలకు మధ్య మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు బ్యారెళ్ల నీరు. రెండు బకెట్ల ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలి. దుకాణాల వద్ద టపాసులను పేల్చరాదు. బాణాసంచా కాల్చే సమయంలో తగినన్ని నీరు అందుబాటులో ఉంచుకోవాలి. టపాసులు కాల్చే సమయంలో గాయపడితే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి.





దుకాణాల్లో సిద్ధంగా ఉన్న రకరకాల బాణసంచాలు

● అత్యవసర సేవలకు ఫోన్ నంబర్లు అగ్నిమాపక శాఖ నంబరు.. 101, పోలీసు శాఖ నంబరు..100, అంబులెన్సు..108

క్రైం సమాచారం

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



గొర్లశంకర్ (ఫైల్)

ఆదిలాబాద్(జైనథ్), అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గొర్లశంకర్ (35) మద్యానికి బానిసై శనివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు జైనథ్ మండల ఏఎస్సై ఆత్మరాం తెలిపారు. కుటుంబ సభ్యులు మండల పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..మృతుడు గొర్లశంకర్ వ్యవసాయ కూలీగాపని చేస్తూ జీవనం కొనసాగించేవాడని అన్నారు. మృతునికి భార్య గొర్లసురేఖ గత ఐదు నెలలు కిందట మరణించగా తరుచూ మద్యానికి బానిసై శనివారం ఉదయం తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ మండల ఏఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామ నిర్వహించారు. మృతునికి ఒక కూతురు ఒకకుమారుడు ఉన్నారని దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పశువుల లారీ పట్టివేత



భోరజ్ వద్ద పట్టుబడ్డ పశువుల లారీ

ఆదిలాబాద్(జైనథ్),అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):జైనథ్ ఉమ్మడి మండలంలోని భోరజ్ చెక్‌పోస్టు సమీపంలో శనివారం అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు జైనథ్ మండల ఎస్సై పవార్‌గౌతమ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో నాగ్‌పూర్ నుంచి నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్న క్రమంలో లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇందులో 25 ఎడ్లు (పశువులు) ఉన్నాయని లారీ డ్రైవర్ గురుదమాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్‌పై కేసుచేసి పశువులను ఇచ్చోడ మండలంలోని జైశ్రీరాం గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల పైన కేసు నమోదు

లోకేశ్వరం,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):మండలంలోని బామ్ని(కే) గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై కేసు నమోదు ఆయన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం...మైసన్న అనే రైతు బామ్ని (కే) గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువు దగ్గర 2 ఎకరాల శిఖం భూమిని గత కొన్ని సంవత్సరాల నుంచి వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఆ భూమిని గ్రామ పెద్ద మనుషులు పశువులు మేపుకోవ డానికి, చెరువు కబ్జా చేయడం వల్ల చెరువులో నీరు తక్కువై కింది పొలాలకు నీరు రాక ఇబ్బంది అవుతుందని మైసన్నను వ్యవసాయం చేయవద్దని చెప్పిన అతను వినకుండా వరి పంటను వేశాడు. ఆ విషయంలో గ్రామ పెద్దలు,వీడీసీ సభ్యులు అందరూ కలిసి అతనితో ఎవరు మాట్లాడవద్దని తీర్మానం చేశారని మైసన్న దరఖాస్తు ఇవ్వగా వీడీసీ సభ్యులు, గ్రామపెద్దలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైందని లోకేశ్వరం ఎస్సైఅశోక్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 19 అక్టోబరు 2025



దండారీ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ఆదిలాబాద్(సిరికొండ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయిగూడ గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించే గుస్సాడీ దండారీ ఉత్సవాల్లో పాల్గొనాలని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను శనివారం గ్రామపెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాయిగూడ గ్రామ పటేల్ పంద్రం హన్మంతరావు, మాజీ సర్పంచ్ జుగ్నక్ కృష్ణ, మహాజన్ సిడాం మదన్, సిడాం జైవంత్ రావు, ఆత్రం శంబు, పెందుర్ లక్ష్మణ్ రావు, సిడాం సాయి, తదితరులు ఉన్నారు.



కలెక్టర్ రాజర్షి షాను ఆహ్వానిస్తున్న రాయిగూడ గ్రామస్థులు

'గుస్సాడీ'కి జాతీయ గుర్తింపు రావాలి

- ఉట్నూర్ మండలం మత్తడిగూడలో ఎస్పీ అఖిల్ మహాజన్
- ఏజెన్సీలోని గూడెల్లో ఊపందుకున్న దండారీ ఉత్సవాలు
- ఆదివాసీలతో కలిసి నృత్యాలు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



సిరికొండ మండలం రిమ్మలో రేలా పాటలకు నృత్యం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్

7లో



ఇంద్రవెల్లి మండలంలోని డోంగర్ గావ్‌లో గుస్సాడీలతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



● వెలవెలబోతున్న జిల్లాకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం

● పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాలు

బీసీల చుట్టే.. రాజకీయం

జిల్లాలో గత కొద్ది రోజులుగా.. బీసీల చుట్టే రాజకీయం అన్నట్లుగా కనిపిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో 9ని విడుదల చేయడంతో బీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమయ్యింది. కానీ హైకోర్టు 42 శాతం రిజర్వేషన్లపై స్టే విధించడంతో బీసీ వర్గాలు ఆగ్రహానికి గురయ్యాయి. హైకోర్టు స్టేను నిరసిస్తూ శనివారం రాష్ట్ర బంద్‌కు బీసీ జేఏసీ పిలుపునిచ్చింది. దీంతో జిల్లాలో బీసీ సంఘాలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.

- బీసీ జేఏసీ పిలుపుతో జిల్లా బంద్ ప్రశాంతం
- పోటాపోటీగా నేతల ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు
- మధ్యాహ్నం వరకు సంపూర్ణ బంద్.. ఆ తర్వాత అంతా ఓపెన్
- ఉదయం నుంచి డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు, నాయకుల డిమాండ్
- గట్టిబందోబస్తును ఏర్పాటు చేసిన పోలీసులు

ఆదిలాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, కుల సంఘాలు మద్దతుగా నిలవడంతో విజయవంతమైంది. ఉదయం ఆర్టీసీ డిపో ముందు బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అలాగే జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలలో వ్యాపార సముదాయాలను మూసి వేయించారు. బంద్‌కు మద్దతుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, బీసీ సంఘ నాయకులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, గండ్రత్ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, సీపీఐ, సీపీఎం, ఆయా కుల సంఘాల నాయకులు, అఖిల పక్షం నేతలు, తదితరులు బంద్‌కు మద్దతుగా నిలిచారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మొత్తానికి జిల్లాలో బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది.

మద్దతుగా నిలిచిన పార్టీలు

బీసీ జేఏసీ పిలుపు మేరకు అన్ని రాజకీయ పార్టీలు బంద్‌కు మద్దతుగా నిలిచాయి. పోటాపోటీగా నేతలు ర్యాలీలు, ధర్నాలు, నిరసనలకు దిగారు. ఉదయమే ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో డిపో ప్రధాన గేటు ముందు బైఠాయించి అడ్డుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆందోళన కు దిగారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా బైక్ ర్యాలీని నిర్వహించి వ్యాపార సముదాయాలను మూయించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. బీసీలకు మద్దతుగా నినాదాలు చేశారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పాయలశరత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించి బంద్‌కు మద్దతును ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రధాన పార్టీలు బీసీ బంద్‌కు మద్దతుగా నిలవడంపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అన్ని పార్టీలు బీసీలకు మద్దతుగా నిలుస్తున్నా.. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టడం లేదన్న టాక్ వినిపించింది.

ఉదయమే హడావుడి

బీసీ సంఘాల పిలుపుతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపారులు జిల్లా అంతటా సంపూర్ణ బంద్‌ను పాటించారు. ఆ తర్వాత యధావిధిగా వ్యాపార దుకాణాలు తెరుచుకున్నాయి. మొత్తానికి అఖిలపక్షం, బీసీ సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు బీసీ బంద్



డిపోలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



మూసి ఉంచిన పెట్రోల్‌బంక్



పట్టణంలో నిర్మానుష్యంగా ప్రధాన కూడలి

పకడ్బందీగా పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

» వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోలు, కౌలు రైతుల నమోదును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తి కొనుగోళ్లు, కౌలు రైతుల నమోదు, క్రాప్ బుకింగ్, పంట నష్టం అంచనాలపై మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు మండల స్థాయిలో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కపాస్ కిసాన్ స్లాట్ బుకింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేసి, రైతుల సౌకర్యం కోసం అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని ఆదేశించారు. కౌలు రైతుల నమోదులో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని, అర్హులైన ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, చెల్లింపు వంటి ప్రక్రియలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని, మార్కెట్ యార్డ్ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, ఏడి మార్కెటింగ్ గజానంద్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): జిల్లాకేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ గోదాంను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. ప్రతి నెలా నిర్వహించే సాధరణ తనిఖీలో భాగంగా కలెక్టర్ గోదాంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరా పర్యవేక్షణ వ్యవస్థ, అగ్నిమాపక పరికరాల లభ్యత, విద్యుత్ వ్యవస్థ, యంత్రాల నిల్వ విధానం తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు అత్యంత భద్రతతో సంరక్షించబడాలని, గోదాం పరిసర ప్రాంతంలో అనధికారిక ప్రవేశం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యంత్రాల రికార్డులు సక్రమంగా నిర్వహిస్తూ, అవసరమైనప్పుడు సులభంగా గుర్తించగలిగే విధంగా వర్గీకరణ చేయాలని సూచించారు. గోదాం వద్ద అగ్నిమాపక పరికరాలు సమయానికి పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

హాస్టల్ కోసం స్థల పరిశీలన

బజార్‌హత్నూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణం కోసం శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య స్థల పరిశీలన చేశారు. హైస్కూల్ ఆవరణలో ప్రశాంత వాతావరణంలో విద్యార్థుల చదువు, అలాగే హాస్టల్ వసతి ఒకే దగ్గర ఉంటుందని అన్నారు. వీరితో జల్కె పాండురంగ్, జంగు బాబు, గవ్వల దేవేందర్, జాదవ్ గణేష్, గవ్వల రాజు, సయ్యద్ సల్మాన్, జాదవ్ రమేష్, బత్తిని కిషన్, గొల్లనగు రమేష్, తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్



ఉట్నూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తు ఎమ్మెల్యే బొజ్జు



..ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తున్న బీసీ పోరాట సమితి



బోథ్ బస్టాండులో ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు



ఇచ్చోడలో ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మండలాల్లో బీసీ బంద్ ప్రశాంతం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కల్పించి విద్యా ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలంటూ బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు మేరకు శనివారం జిల్లాలోని పలు మండలాల్లో బంద్ ప్రశాంతంగా సాగింది. పలుచోట్ల బీసీ సంఘాలతో పాటు అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలతో హోరెత్తించగా.. వ్యాపార సముదాయాలను స్వచ్ఛంధంగా మూసి ఉంచారు.



సోనాలలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మైనార్టీ గురుకులం తనిఖీ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారి షేక్ కలీం అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా గురుకుల పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌కు సలహాలు, సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఫరీన్ సుల్తానా, సూపరిండెంట్ రుహిల్, తదితరులు ఉన్నారు.

పత్తి జిన్నింగుల పరిశీలన

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పత్తి పంట కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల వ్యవసాయ అధికారి రవితేజతో కలిసి తహసీల్దార్ సుభాష్‌చంద్ర మండల కేంద్రంలోని పరిశీలించారు. జిన్నింగ్ యజమానులకు పత్తి కొనుగోల కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌తో పాటు ఏఈఓ, వాజిద్ రైతులున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. ఇద్దరు బీట్ ఆఫీసర్ల సస్పెన్షన్

బోథ్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బోథ్ అటవీ రేంజి పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇరువురు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గత 15 రోజుల క్రితం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఘనపూర్ చెక్ పోస్ట్ లో విధులు నిర్వహించే బీట్ ఆఫీసర్ కలీం విధులకు తరచుగా గైర్హాజరు అవుతున్నాడు. చెక్ పోస్టులో ఉండకుండా ప్రైవేటు వ్యక్తులతో తిరుగుతున్నట్లు అధికారుల తనిఖీలు బయటపడడంతో సదరు బీట్ ఆఫీసర్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు అటవీ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. కాగా మరో బీట్ ఆఫీసర్ విధులు నిర్వహించకుండా తరచుగా విధులకు గైర్హాజరవుతూ ఉండడం వల్ల అధికారులు ఆయనపై వేటు వేసినట్లు తెలిసింది. అయితే బీట్ ఆఫీసర్ కు సస్పెన్షన్‌కు సంబంధించిన ఆదేశాలు ఏవి ఇంతవరకు అందలేదని కార్యాలయ వర్గాలు తెలిపాయి. అడవుల పరిరక్షణకు అటవీ శాఖ అధికారులు దేగకళ్లతో పరిశీలిస్తుంటే కొంతమంది ఉద్యోగులు విధులను నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చూసి చూడనట్లు వ్యవహరిస్తే మరింత మంది ఉద్యోగులు విధులకు ఎగనామం పెట్టే ఆస్కారం ఉందని అటవీ శాఖ వర్గాల వారు అంటున్నారు. సస్పెన్షన్ వేటితోనైనా ఉద్యోగుల తీరులో మార్పు వస్తుందని అంటున్నారు. పూర్తి వివరాలు తెలిపేందుకు సంబంధిత రేంజ్ అధికారి అందుబాటులో లేరు.

జాతీయ స్థాయిలో గుర్తింపు సంతోషకరం : పీవో

ఉట్నూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆదికర్మయోగి, దర్తిఅబాజన భాగీధారి పథకాలను ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషంగా ఉందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా శనివారం తెలిపారు. ఆదివాసీ వ్యవహారాలమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈనెల 17న నిర్వహించిన జాతీయ సదస్సులో ఆది కర్మయోగి అభియాన్ కింద ఆదిలాబాద్ జిల్లాను అగ్రజిల్లాగా, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్‌ను ఉత్తమ ప్రదర్శన చేసిన సంస్థగా ధర్తీజన పతకం కింద ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు అగ్ర జిల్లాలుగా ఎంపిక అయ్యాయని తెలిపారు. గిరిజన గ్రామాల విజన్ 230 ప్రక్రియలో అభివృద్ధి చెందుతున్న నూతన పరిపాలన నమునాలను ప్రదర్శించడం జరిగిందని, ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రాష్ట్రపతి హాజరు కాగా 17న లైన్ మంత్రిత్వ శాఖలకు చెందిన యూనియన్ క్యాబినెట్ మంత్రులు, క్యాబినెట్ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాష్ట్రాల ప్రతినిధులు, ఆదవాసీ సంక్షేమ సంస్థల ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పతకాలు, జీవనోపాధి కార్యక్రమాల అమలులో చూపిన ఉత్తమ పద్ధతులు, లబ్దిదారుల విజయ కథలు, సమాజం ఆధారంగా రూపొందిన సృజనాత్మక కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతి ఫలితాలను అందించిందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు ఆదివాసీ సమాజ అభ్యున్నతికి పరిపాలనకు, గ్రామస్థాయి అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యతను ఈ విజయం ప్రతిబింబిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ జిల్లాలలో ఆదివాసీ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది చేసిన విశిష్ట కృషికి ఫలితం దక్కిందని అభినందించారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

గిరిజన విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలంకు చెందిన గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ చేయడం జరిగిందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన గిరిజన విద్యార్థి మేస్రం జగన్ కుమార్‌కు ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్ అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని పీవో సూచించారు.